అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 19 జులై 2023

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

లక్ష్మణచాంద : మండల కేంద్రంలో మంగళవారం ఎంపీడీఓ శేఖర్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, డ్రై డే గురించి ఇంటింటికి తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ నిల్వ నీటిని తొలగిస్తూ అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండడం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. డెంగ్యూ దోమలు నివారణ గురించి తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నసీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చెరువు కట్ట పొడవు కంచె ఏర్పాటు చేయాలి

జైపూర్ : ఇందారం-రామారావుపేట్ మధ్య చెరువు కట్ట పొడవు కంచె ఏర్పాటు చేయాలని ఇందారం ఎంపీటీసీ-2 అర్కె స్వర్ణ సంతోష్ యాదవ్ కోరారు. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందారం నుండి రామారావుపేట్ వరకు చెరువు కట్ట మీదుగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులతో చెరువు కట్ట పొడవు గల కంచె చెడిపోయిందని తెలిపారు. ఫలితంగా రైతులు పంటలను సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని, చెరువు కట్ట పొడవు కంచె ఏర్పాటు చేస్తే యధావిధిగా మళ్లీ పంటలు సాగు చేసేందుకు వీలవుతుందని తెలిపారు. స్పందించిన జీఎం కంచె ఏర్పాటుకు హామీ ఇచ్చారు.



సార్వత్రికం కోసం సన్నద్ధం..!

- పోటాపోటీ కార్యక్రమాలతో రాజకీయ పార్టీల బిజీ
- ప్రచార పర్వంలో దిగిన ప్రధాన పార్టీలు, ఆశావహులు
- ఎన్నికల పనుల్లో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- కొనసాగుతున్న వివిధ శాఖల అధికారుల బదిలీలు
- జిల్లాలో రసవత్తరంగా మారుతున్న పరిణామాలు

ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోలాహలం మొదలైంది. రానున్న డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో ఇటు అధికార యంత్రాంగం.. అటు రాజకీయ పార్టీలు ముందస్తుగా సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఈవీఎంల తనిఖీ, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పూర్తిచేసిన అధికార యంత్రాంగం వాటిని ఆన్‌లైన్‌లో క్రోడీకరించే ప్రక్రియను చేపడుతోంది. ఓటు నమోదుపైనా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టి ఎన్నికల వాతావరణాన్ని గుర్తుచేస్తున్నారు. ఇప్పటికే కొందరు అధికారుల బదిలీలు పూర్తికాగా.. మరికొన్ని రోజుల్లో మిగితా శాఖల బదిలీలు కూడా ఉంటాయని ప్రచారం జరుగుతోంది. మరోపక్క ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు రంగం చేసుకుంటున్నారు. పోటాపోటీ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో ఉండేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా..ఏ నలుగురు కలిసినా రానున్న ఎన్నికలపైనే ప్రధాన చర్చ జరుగుతోంది.



అన్ని పార్టీల నాయకులతో కలిసి ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మరో సార్వత్రిక సమరానికి సమయం దగ్గర పడుతోంది. మరో అయిదు నెలల్లో ఎన్నికలు జరిగే ఆస్కారముందనే ప్రచారంతో బరిలో నిలిచేందుకు ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ సారి ఎన్నికల బరిలో నిలవాలని అనేక మంది ఆశావహులు ఉవ్విళ్లూరుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు సీపీఐ(ఎం), సీపీఐ, బీఎస్పీ, డీఎస్పీ వంటి పార్టీలు ఎన్నికల బరిలో నిలించేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రధాన పార్టీల తరపున బరిలో నిలవాలని భావిస్తున్న నాయకులు ఇప్పటికే ప్రత్యేక వాహనాల ద్వారా ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాల్లోని వార్డులకు వెళ్తూ ప్రజలను కలుస్తూ మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. పార్టీలో చేరికల కార్యక్రమాలతో బిజీబిజీగా గడుపుతున్నారు. ఇది వరకే ఆయా పార్టీల అగ్రనాయకులు ఉమ్మడి జిల్లాలో పర్యటించి శ్రేణులను ఉత్సాహ పర్చారు. మరోపక్క ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అధికార బీఆర్‌ఎస్, రేవంత్‌కు అనుకూలంగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీ కార్యక్రమాలు చేపట్టడం జిల్లా రాజకీయాలను మరింత వేడెక్కించాయి. ఇరుపార్టీల నాయకుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకోవడం ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తోంది. మరోపక్క ఆయా ప్రధాన పార్టీల తరుపున ఇది వరకు పోటీ చేసిన అభ్యర్థులతో పాటు కొత్తవారు కూడా టికెట్లు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తి రేకెత్తిస్తోంది.

ఎన్నికల పనుల్లో యంత్రాంగం

ఎన్నికల సమయం దగ్గరపడతుండటంతో అధికార యంత్రాంగం ఆ పనుల్లో నిమగ్నమవుతోంది. ఇది వరకే రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంల తనిఖీ నిర్వహించగా.. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసింది. ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు.మరోపక్క ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు రిటర్నింగ్‌అధికారులు(ఆర్‌ఓ), సహాయ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్‌ఓ)ల నియామకం కూడా పూర్తయింది. ఎన్నికల విధుల్లో భాగంగా అధికారుల బదిలీలు కూడా దాదాపు పూర్తికావచ్చింది. ఇప్పటికే ఆర్‌డీఓలు, డీఎస్పీలు, సీఐ, ఎస్సైల బదిలీలు జరగ్గా..త్వరలోనే తహసీల్దార్లు, ఎంపీడీఓల బదిలీలు కూడా ఉంటాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. జిల్లాకు చెందిన వారు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోనుండగా.. ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు కూడా అధికారుల బదిలీలు జరగనున్నాయి. ఇలా అధికార యంత్రాంగంతో పాటు రాజకీయ పార్టీలు ఎన్నికల కోసం సన్నద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



కాంగ్రెస్ నాయకుల ఆందోళన(ఫైల్)



బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన(ఫైల్)

పార్టీ గెలుపు కోసం కార్యకర్తలతో కలిసి పని చేస్తా : రాజారమేష్

నవతెలంగాణ-జైపూర్



ఇటు రాష్ట్రంలో అటు దేశంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలతో కలిసి పని చేస్తానని చెన్నూర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజా రమేష్ తెలిపారు. మంగళవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఆయన మొదటిసారి గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలతో మమేకమై వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజారమేష్‌తో పాటు మందమర్రి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మందమర్రి అధ్యక్షులు జీవన్‌కుమార్, అధికార ప్రతినిధి బొడ్నాల శ్రీనివాస్, జైపూర్‌టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, మహేష్, సురేష్, కిరణ్‌కుమార్, పవన్, వంశీ, నరేష్, శ్రీకాంత్, సూరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఉత్తర్వులు సవరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు సంబంధించి చేసిన ఉత్తర్వులను సవరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాధికారి అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో నెంబర్ 17 ప్రకారం కనీసం పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని అలా కాకుండా సవరింపుల పేరుతో జూనియర్ ఉపాధ్యాయులను వేరే చోటికి పంపడంతో ఏకోపాధ్యాయ పాఠశాలలు తల్లిదండ్రుల నమ్మకాన్ని కోల్పోతున్నాయన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సర్వేను రిజిస్టర్ల నమోదు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అడె ప్రకాష్, సెడ్మెకే రాము, మడావి హనుమంతు, గుళ్లపల్లి రవిశంకర్, తాటి విజయ నిర్మల, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేత



నవతెలంగాణ - హాజీపూర్

మండలంలోని ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను గోనె సతీష్‌రావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి గోనె నర్సింగరావు జ్ఞాపకార్థం తొమ్మిది సంవత్సరాలుగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా దాదాపు 200 మంది విద్యార్థులకు 1000 పుస్తకాలను అందించామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంచాల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణపతిరెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి ఇంటింటికి సంక్షేమ పథకాల ఫలాలు అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని, అభివృద్ధే పరమావధిగా పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. 17 మంది లబ్దిదారులకు 5లక్షల50వేల విలువైన చెక్కులను అందించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ఫలాలు చేరుతున్నాయని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు అభివృద్ధికే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు భూమన్న, ధమ్మపాల్, రాంకుమార్, సాజిదోద్దీన్ పాల్గొన్నారు.

రైతులు పంటలు నమోదు చేసుకోవాలి

నేరడిగొండ : వానాకాలంలో వేసిన పంటల వివరాలు వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర నమోదు చేసుకోవాలని ఏవో భాస్కర్ రైతులకు సూచించారు. మండలంలోని గాంధారి గ్రామంలో జరుగుతున్న క్రాఫ్ బుకింగ్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సాగు విస్తీర్ణం కచ్చితంగా సర్వే చేసి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు గంజాయి పంటను సాగు చేయవద్దని, చేస్తే రైతుబంధు పథకం నిలిపివేస్తామని హెచ్చరించారు. గతంలో గంజాయి సాగు చేసిన రైతులకు రైతుబంధు నిలిపివేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దినేష్, రైతులు ప్రవీణ్, నరేందర్ పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

ఆదిలాబాద్‌టౌన్ : సమస్యలు పరిష్కరించాలని గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పి) జిల్లా అధ్యక్షుడు శశికాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నెల మొదటి తేదీన అన్ని జిల్లాల వారికి పెన్షన్ చెల్లించాలని, అన్ని కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటల్స్‌లలో నగదు రహిత చికిత్స, ఈహెచ్‌ఎస్ వైద్యం అమలు చేయాలన్నారు. గరిష్ట పరిమితిని ఎత్తివేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేస్తున్నామని తెలిపారు. పెన్షనర్స్ అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుమురం భీం జిల్లాలో భారీ వర్షం



- లోతట్టు ప్రాంత ఇండ్లలోకి చేరిన వరద నీరు
- అడ ప్రాజెక్టు గేట్ ఎత్తివేత
- పొంగిన వాగులు, నిలిచిన రాకపోకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుమురం భీం జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు మునిగి పోయాయి. అడ ప్రాజెక్టు గేట్ ఎత్తి అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా కేంద్రంలో రోజంతా భారీ వర్షం కురవడంతో పలు కాలనీలు వరదల్లో చిక్కుకున్నాయి.

అడ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

వరద నీరు చేరడంతో అడ ప్రాజెక్ట్ గేట్ ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. అధికారులు సాయంత్రం వరకు 5వ నెంబరు గేట్‌ను 0.10 మీటర్లు ఎత్తి 208 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా సాయంత్రం వరకు 237.600 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు సామర్థ్యం 10.393 క్యూసెక్కులు కాగా ఇప్పటివరకు 5.629 క్యూసెక్కుల చేరుకుంది. ఇన్‌ఫ్లో 208 క్యూసెక్కులుగా ఉంది. దీంతో గేట్ ఎత్తి 208 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

జిల్లా కేంద్రంలో నీటమునిగిన కాలనీలు

జిల్లా కేంద్రం అయినప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో అనేక కాలనీలు నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంట కాలనీ, పైకాజీనగర్, జూబ్లీ మార్కెట్ ప్రాంతం, సందీప్ నగర్‌లోని కొంత ప్రాంతం, టిఆర్‌నగర్, రాజంపేట, ప్రేమలగార్డెన్ వెనుక ప్రాంతం, జనకాపూర్ కాలనీలు నీటితో బురదమయంగా మారాయి. మండలంలోని రహపల్లి గ్రామంలో రాజుర్కార్ గణపతి ఇంటి పక్కనే ఉన్న కాలువను కొందరు మూసివేయడంతో వర్షపు నీరు ఇంట్లోకి చేరింది. నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి.

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసింది. అధికారుల లెక్కల ప్రకారం సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు జిల్లాలో సగటు 34.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జైనూర్‌లో 17.2 మి.మీ, సిర్పూర్(యు)లో 13.6, లింగాపూర్‌లో 18.8, తిర్యానిలో 24.8, రెబ్బెనలో 41.2, ఆసిఫాబాద్‌లో 19.4, కెరమెరిలో 13.8, వాంకిడిలో 21.2, కాగజ్‌నగర్‌లో 32, సిర్పూర్(టి)లో 40.2, కౌటాలలో 46.4, చింతలమానేపల్లిలో 58.2, బెజ్జూర్‌లో 49, పెంచికల్‌పేటలో 56.2, దహెగాం 63.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలంలోని ఫకీర్‌గుట్ట కాలనీలో న్యాక్ సెంటర్‌లో మూడు నెలల కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన మొదటి బ్యాచ్ 29 మంది, రెండవ బ్యాచ్ 17 మంది మహిళలకు ప్రభుత్వం తరపున ఉచితంగా కుట్టు మిషన్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటర్నెట్ ద్వారా దాదాపు 18 రకాల వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. మహిళలు కుట్టు మిషన్ కాకుండా సాంకేతికంగా స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. మహిళల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కుటుంబానికి అండగా ఉండడానికి కుట్టు మిషన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, న్యాక్ ఏడీ నాగేంద్రం, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గోవర్ధన్, ఇన్‌స్ట్రక్టర్ నిక్కత్ ఫారహీన్, ఖదీరా, నిర్వాహకులు అంజద్‌ఖాన్ పాల్గొన్నారు.

రైతుల పట్ల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు దారుణం



నవతెలంగాణ-కాసిపేట

రైతులు, వ్యవసాయం పట్ల రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా మాట్లాడడం పట్ల కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలు తెలుస్తున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట మండలంలోని ధర్మారావుపేట రైతు వేదిక లో రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా రైతు సదస్సు నిర్వహించి రైతులకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు రైతులు తమకు అందుతున్న పథకాలను స్వయంగా వివరించారు. దీంతో పాటు రైతులకు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక తెలంగాణ రైతులు బాగుండాలని రైతులకు కావాల్సిన నాణ్యమైన విద్యుత్ ఇచ్చారని గుర్తు చేశారు. చెరువులను మరమ్మత్తులు చేసి సాగు నీరు అందించడం, అన్ని కులవత్తుల అభివద్ధికి అవకాశం కల్పించారన్నారు. తెలంగాణ ప్రభుత్వ రైతులకు అండగా ఉంటూ అన్ని రకాల సౌకర్యాలు అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం తన రైతు వ్యతిరేక విధానాలు భయట పెడుతుందన్నారు. దీనిని తెలంగాణ ప్రజలు, రైతులు గమనిస్తురన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అప్పాల శేఖర్, మంజులారెడ్డి, సర్పంచులు ఆడె బాదు, మక్కల శ్రీనివాస్, ముత్యాల స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

అన్నాభావు సాఠె అడుగు జాడల్లో నడవాలి

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్

నవతెలంగాణ-ఉట్నూర్

బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకు నిరంతరం పోరాడిన సామాజిక విప్లవకారుడు అన్నాభావు సాఠెను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. అన్నాభావు సాఠె వర్ధంతిని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ వర్ధంతికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన నిలబడి హక్కుల సాధన కోసం సాహిత్య రూపంలో అనేక పాటలను రాసి వారిలో చైతన్యాన్ని నింపిన గొప్ప తాత్వికుడు అన్నభావు సాఠె అని వ్యాఖ్యానించారు. నేటి యువత ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకొని, వారు చూపిన బాటలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వర్ధంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





ఆదిలాబాద్‌టౌన్ : మహనీయుల అడుగు జాడల్లో నడుస్తూ వారి ఆశయాలను సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్నాబావు సాఠె 54వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని విదేశాల్లో చాటి చెపుతూ విప్లవ కవిగా అన్నాబావు సాఠె చేసిన కృషి మరవలేనిదన్నారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాటు పడుతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, అన్నాబావు సాఠె అసోసియేషన్ అధ్యక్షులు ఉద్ధవ్ కాంబ్లే, ఉపాధ్యక్షులు సూర్యకాంత్, నర్సింగ్, నాయకులు యూనుస్ అక్బానీ, సామాజిక కార్యకర్త బండారి దేవన్న పాల్గొన్నారు.

ముత్నూర్‌ను ఓడీఎఫ్ గ్రామంగా తీర్చిదిద్దాలి



ఇంద్రవెల్లి : ముత్నూర్ పంచాయతీని ఓడీఎఫ్(సంపూర్ణ బహిరంగ మల మూత్ర రహిత) గ్రామంగా తీర్చి దిద్దాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలోని పలు పంచాయతీలను ప్రభుత్వం స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు కోసం ప్రతిపాదనలు పంపిందన్నారు. దానిలో భాగంగా జిల్లాలో ఈ నెల 20 నుంచి కేంద్ర బృందం జిల్లా పర్యటనకు రానుందన్నారు. వివిధ శాఖల అధికారులందరు కలిసి సంబంధిత పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు కలిగి ఉండాలన్నారు. అంగనవాడీ కేంద్రం, పాఠశాలల్లో సంపూర్ణ మౌలిక వసతులు కలిగి ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల పనులను ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. అనంతరం పల్లెప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, తడి పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించారు. ఆయన వెంట శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీజ, సర్పంచ్ తుమ్రం బాగుబాయి, డిపిఓ శ్రీనివాస్, ఎంపిడిఓ పుష్పలత, ఈసీ శ్రీనివాస్, ఎంపిఓ సంతోష్ వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రామపంచాయతీలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. మంగళవారం ఇన్‌చార్జీ డీపీఓ సురేందర్‌తో కలిసి ఎంపీడీఓలు, ఎంపీఈఓలు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, హరితహారం, అంటువ్యాధుల నియంత్రణ, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ అంశాలపై సమీక్షించారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులను అలసత్వం లేకుండా సక్రమంగా నిర్వహించాలని, మురుగు కాలువలలో పూడిక తీయాలని, రోడ్లు, నివాస ప్రాంతాలలో వర్షపు నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమల వృద్ధిని నిరోధించేందుకు దోమల మందు పిచికారి చేయాలని, మంచినీటి బావులలో బ్లీచింగ్ పౌడర్ వేయాలని తెలిపారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ కొరకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సుధాకర్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్



ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓ పక్క కుండపోత వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన ఫ్లోర్ లీడర్ నివాస గృహాలకు వెళ్లి వారి వారి పాత్రలో నిలువ ఉంచిన నీటిని తీసి పాత్రలను శుభ్రం చేయించారు. అలాగే డ్రైడే ఆవశ్యకత గురించి వివరించారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ డివిజన్ సాధించేంతవరకు ఉద్యమం ఆపేది లేదు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ అయ్యేంతవరకు ఉద్యమాలు ఆపేది లేదని బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిరసనలు వ్యక్తం చేస్తూ, విద్యార్థిని విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. అలాగే ప్రజా ప్రతినిధులు పట్టించుకొని, బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ బోథ్‌లో జనరల్ డిగ్రీ కళాశాలతో పాటు పెండింగ్‌లో ఉన్న నూతన రిటర్నింగ్ కార్యాలయాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తరలిపోయిన కార్యాలయాలు బోథ్‌కు వచ్చేంతవరకు ఉద్యమాలు కొనసాగుతాయని సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులతో పాటు రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామంలో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మలపతి నారాయణ, గోంటిముక్కల శివ్వమ్మ కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎంపీ గోడం నగేష్, జెడ్పీటీసీ తాటిపెల్లి రాజుతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు అండె ఆనంద్ కుమారునికి ఇటీవల ఆపరేషన్ కాగా వారిని పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల గదులను పరిశీలించి, విద్యార్థులతో సరదాగా మాట్లాడి మధ్యాహ్న భోజనం, పాఠశాలలో ఉన్న వసతులను, ఉపాధ్యాయులను గ్రామసర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమణ, సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ మలపతి విలాస్, నాయకులు లింగారెడ్డి, గడుగు గంగన్న, ముచ్చ రఘు, దేవేందర్, ఆశన్న, మల్లయ్య, చంద్రన్న ఉన్నారు.

జాతీయస్థాయి సమ్మేళనానికి తరలిన మాలీ సంఘం నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అఖిల భారతీయ మాలీమహా సంఘం 22వ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని 19న మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయస్థాయి మాలీ సమ్మేళనానికి తెలంగాణ నుంచి నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే మంగళవారం మాట్లాడుతూ తెలంగాణలోని మాలీకులస్తులు గత 22 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి సీఎం కేసీఆర్ చేత మాలీలకు ఎస్టీ హోదా కల్పిస్తున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంలో సఫలీకృతమైందన్నారు. కేంద్రం వెంటనే తెలంగాణ మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని కోరుతూ దానితో పాటు, జాతీయస్థాయి సమ్మేళనంలో దేశవ్యాప్తంగా ఉన్న మాలీలకు ఎస్టీ హోదా కల్పించే విధంగా తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనంలో అనేక రాష్ట్రాల మాలీ ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. నాసిక్‌కి బయలుదేరిన వారిలో సుభాష్ షేండే, మురళీధర్ నాగోషే, అంబాదర్ షేండే, ధనుంజయ ప్రధాన్, విజయ్ వాడగురే, గజానన్ చౌదరి, మహిళా నాయకులు కల్పన పెట్కులే, లక్ష్మి షేండేలు ఉన్నారు.

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలి

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని దిలావర్‌పూర్ మండల గ్రామ పరిసర ప్రాంతంలో జనావాసాల్లో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలని, జనావాసాలకు దూరంగా పరిశ్రమను నెలకొల్పితే ఎలాంటి అభ్యంతరం లేదని దిలావర్‌పూర్ రైతులు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి మంగళవారం క్యాంప్ కార్యాయలంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశ్రమ ఏర్పాటు వలన ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వెల్లడించారు. పంట పొలాల్లోకి వ్యర్థాలు చేరుతాయని, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జనావాసాలకు దూరంగా పరిశ్రమ ఏర్పాటు చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్థానిక ప్రజల అభిప్రాయాలను సేకరించి, అనుమానాలను నివృత్తి చేసి అనువైన ప్రాంతంలో ఇథానాల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తే స్పష్టత వచ్చేదని అన్నారు. అలా చేయనందు వల్లే రైతులు ఇక్కడ పరిశ్రమను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండలంలోని రైతులు పాల్గొన్నారు.

'తొమ్మిదేండ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు'

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

తొమ్మిదేండ్ల కాలంలో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన అభివృద్ధి ఏమీలేదని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పార్క్ ప్రాంగణంలో నిర్వహించిన బీజేపీ టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో తన హాయంలో జరిగిన అభివృద్ధి పనులు తప్ప బీఆర్ఎస్ నాయకులు చేసిన అభివృద్ధి ఏమీలేదని ఆరోపించారు. ఖానాపూర్ పట్టణ అభివృద్ధికి ప్రధానమైన బాధనకుర్తి వద్ద గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే కడెం మండలంలోని గంగాపూర్ గ్రామానికి రహదారి సౌకర్యం, పెంబి మండలంలోని అనేక గ్రామాలకు రోడ్లు నిర్మాణం, పట్టణంలో అంతర్గత రోడ్ల సీసీ పనులు, డ్రైనేజీలు, గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించినది తన హాయంలోనేని తెలిపారు. ఇలా చెప్పుకుంటూ పోతే నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో తాను చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తాయని వివరించారు.

తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు...

తాను కాంగ్రెస్ పార్టీలోకి పోతున్నట్టు జరుగుతున్న తప్పుడు మాటలను ప్రజలు నమ్మొద్దని రాథోడ్ రమేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమావ్యక్తం చేశారు. ఈ క్రమంలో పట్టణంలోని సుభాష్‌నగర్, పద్మావతినగర్, శ్రీరాంనగర్ వీధులకు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాయిని సంతోష్, బుచ్చన్న యాదవ్, డి.మల్లయ్య, మల్లేష్, ఆనంద్, పరమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఇంటి ముట్టడి



నవతెలంగాణ-ఖానాపూర్

గ్రామపంచాయతీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు గత 13 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రేఖ నాయక్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఇప్పటి కార్యక్రమం చేస్తున్న తమను నెట్టి వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గ్రామపంచాయతీ కార్మికులు కనీస వేతనం జీఓ నెంబర్ 60 ప్రకారం రూ.16వేల 500 ఇవ్వాలని, గ్రామపంచాయతీ కార్మికుల పర్మనెంట్ చేయాలి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనీ అన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు 11వ పీఆర్సీని వర్తింపజేయాలని పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. జీఓ నెంబర్ 51 తీసుకువచ్చి కార్మికుల పని భద్రతను దూరం చేసి మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చివేసి పని భారాన్ని పెంచిందని అన్నారు. కార్మికులకు రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ ఇస్తామని సీఎం హామీనిచ్చి, నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. వచ్చే వేతనాలు కుటుంబ పోషణకు సరిపోక గ్రామపంచాయతీ కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రమాదబీమా రూ.10లక్షలు చెల్లించాలని, 60 సంవత్సరాలు నిండిన వారికి రూ.5లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడెం మండల అధ్యక్షుడు గోవిందు, గౌరవ అధ్యక్షులు మహేష్, కోశాధికారి మహేందర్, రాములు నర్సయ్య, నాగరాజు ఖానాపూర్ మండల కార్యదర్శి, కోశాధికారి స్వామి, పోశెట్టి, రవి, పోతు శ్రీనివాస్, దస్తురాబాద్ మండల అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షులు లింగన్న, కోశాధికారి నాయిని అంజన్న, పెంబి మండల అధ్యక్షుడు గోధురి మల్లేష్, మండల కార్యదర్శి లింగన్న, ఉట్నూరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అరుణ్, ఇంద్రవెల్లి అధ్యక్షుడు అరవింద్ ఉన్నారు.

దస్తురాబాద్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు లింగన్న అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న ధర్నా 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం కేటగిరి ప్రకారం వేతనాలు పెంచాలని అన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, అర్హులకి ప్రమోషన్ కల్పించాలని అన్నారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఇన్సూరెన్స్ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రామన్న, విజయ, మండల కార్యదర్శి నర్సయ్య, సహాయ కార్యదర్శి రాజేందర్, నర్సయ్య, గంగన్న, అంజన్న పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా వాన.. చిత్తడిగా రహదారులు

నవతెలంగాణ-ఇచ్చోడ



మండల కేంద్రం నుంచి సొనాల, మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రహదారి అడేగామ(కె) గ్రామంలో చిన్నపాటి వర్షాలకే చెరువుని తలపిస్తుంది. రోడ్డుపై ఏర్పడిన గుంతలు వర్షపు నీరు గుంతల్లోకి వచ్చి చేరింది. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లోతుగా ఉండటంతో ఇచ్చోడ, సొనాల మధ్య వందలలో వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. చిన్నచిన్న వాహనాల సైలెన్సర్‌లో నీరు చేరి, వాహనాలు పాడైపోతున్నాయి. దీంతో వాహనదారులు గ్రామం మధ్యలో గుంతలు ఉండటంతో ఇంట్లో నుంచి కాలు బయట పెడితే బురదలో అడుగు పడాల్సిందే, ఇంత చూస్తున్న నాయకులు, అధికారులు రహదారి దుస్థితి వైపు చూడకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని పార్డి(బి), పల్సి, సొనారి, గోడపూర్, చాతతో పాటు అన్ని గ్రామల్లో సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా బారీ వర్షం కురుస్తోంది. దీంతో మంగళవారం ఉదయం నుంచి మండలంలో అన్ని గ్రామల్లోని అతి బారీ వర్షం కురవడంతో రహదారులు వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పార్డి(బి) నుంచి బైంసా వైపుకు వెళ్లే మార్గంలో ఉన్న గుండెగాం వాగు రాకపోకలకు ఇబ్బందులు ఎదురుకావడంతో కుభీర్ నుంచి ప్రజలు వాహనదారులు ప్రయాణించారు. అదే విధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి భవనం చుట్టూ నీళ్ల నిలవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురువడం జరుగుతుందని తహసీల్దార్ విశ్వరంబర్, ఎంఈఓ చంద్రకాంత్, స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్‌తో పాటు గ్రామస్తులు పరిశీలించారు. జిల్లా స్థాయి అధికారులకు నివేదికలు అందిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ, ఎంపీఓ, ఆలయ కమిటీ అధ్యక్షుడు నారా పరిశురాం గ్రామస్తులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని, మూడు గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆపార్టీ దిగజారుడుతానానికి నిదర్శనమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ రూరల్ మండలం న్యూపోచంపాడ్ గ్రామంలోని రైతువేదికలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వ్యవసాయానికి కరెంట్ ఇస్తలేరని రైతులు ఏమైనా ఫిర్యాదు చేశారని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ఏనాడైనా 24 గంటల ఉచిత నిరంతర విద్యుత్‌ని ఇచ్చారని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని మళ్లీ అందకారంలోకి నెట్టాలని చూస్తోందని అన్నారు. వారి పాలనలో ఏనాడు పగటిపూట కరెంటు ఉండేది కాదని, రాత్రిపూట రైతులు పంటపొలాల వద్ద జాగారం చేసే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వ్యవసాయానికి సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ తో ఇస్తుండటంతో రైతులు మూడు పంటలు పండిస్తూ ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. రైతు రాజ్యం అంటే కేవలం మాటల్లోనే కాక దాన్ని చేతల్లో చేసి చూపించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో అన్నదాతలు సంతోషంగా ఉండటం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, రైతులందరూ బాగుంటే రేవంత్‌రెడ్డి లాంటి వారు పరేషాన్‌లో ఉన్నారని ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ రైతులను రాజకీయ ఓటు బ్యాంకుగా చూసిందే తప్ప ఏనాడు వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేయలేదని కాంగ్రెస్ తీరును ఎత్తిచూపారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణలో కేంద్రం చేతులెత్తితే సీఎం కేసీఆర్ రైతుల పక్షాన నిలిచి కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారన్నారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులను ఆదుకుంటుంటే అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇలాంటి పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతులు మూడు గంటల కరెంటు కావాలా, మూడు పంటల బీఆర్ఎస్ పార్టీ కావాలో తేల్చుకొవాలని కోరారు. రైతు వ్యతిరేఖ కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో పాతాళంలో పాతిపెట్టాలని సూచించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ చిలుక రమణ, గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ రైతు యాత్రను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి గత ఐదు సంవత్సరాలు గడుస్తున్న రైతులకు రుణమాఫీ పేరుతో మోసంచేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును ఎండగడుతూ టీపీసీసీ పిలుపు మేరకు మావల గ్రామం నుంచి ఈ నెల 19న ఉదయం 11 గంటలకు కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న రైతు యాత్రను విజయవంతం చేయాలని అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పలువురు నాయకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రైతులకు అండగా ఉండేందుకు రైతు యాత్ర పేరుతో విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ గత ఐదు సంవత్సరాలు గడుస్తున్న రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ నెరవేరడం లేదని అన్నారు. అదేవిధంగా రైతులకు 24 గంటల కరెంటు పేరుతో మోసం చేయడమే కాకుండా దీనిపై ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా కేసీఆర్ పాలనపై అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు ఈ రైతు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని రైతు సోదరులందరూ పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొండ గంగాధర్, మాజీ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఛైర్మన్ సెద్మకి ఆనందరావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శాంతన్‌రావ్, మావల మండల వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, మావల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి శేఖర్, మావల కోఆప్షన్ సభ్యులు రహీం ఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, కన్య ప్రభాకర్‌రెడ్డి, మావల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెల పేటన్న పాల్గొన్నారు.

ప్రయివేట్ వ్యక్తులను అడ్డుకున్న కార్మికులు

నవతెలంగాణ-ఇచ్చోడ



కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 13రోజుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తే మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలో అధికారులు ప్రయివేట్ వ్యక్తులతో పని చేయిస్తున్నట్లు, సమ్మెలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికులు పనిచేస్తున్న వారిని అడ్డుకున్నారు. సమ్మెలో ఉండగా ప్రయివేట్ వ్యక్తులతో ఎలా పని చేయిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఎంపీఓ రమేష్, ఈఓ సూర్యప్రకాష్ కల్పించుకొని, వర్షం కారణంగా మురికి నీరు, చెత్త, రోడ్డుపై పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులు న్యాయమైన డిమాండ్ కోసం చేస్తున్న సమ్మెకు ఎలాంటి ఆటంకాలు కలిగించామని కార్మికుల హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు అధికారులు, నాయకులు అండగా ఉండాలని అధికారులను కోరారు.

ఘనంగా అన్నాబావు సాఠే వర్ధంతి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బడుగు బలహీనవర్గాల ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిన మహనీయుడు అన్నా బావు సాఠే అని బీఎస్పీ మండల అధ్యక్షుడు పెందూర్ అంకుష్ అన్నారు. మంగళవారం బీఎస్పీ పార్టీ కార్యాలయంలో అన్నా భావు సాఠే 54వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడతూ పేద ప్రజల హక్కుల సాధనకై నిరంతరం పోరాడిన మహనీయుడు గొప్ప సాహిత్యకారుడు అన్నాభావు సాఠే అని అన్నారు. ఆ మహనీయుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. నేటి యువత ఆయన చూపిన బాటలో నడువాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సోయం రాందాస్, ఉపాధ్యక్షుడు వావల్కర్ శివాజీ, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు సోన్ కాంబ్లే సునీల్, మండల ప్రధాన కార్యదర్శి కాంబ్లే దీపక్, ఉపాధ్యక్షులు జొందలే విజయ్, మెస్రం మురారి, సోయం మాధవ్ పాల్గొన్నారు.

మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో ...

ఆదిలాబాద్‌టౌన్ : మాంగ్ సమాజ్ ఆదిలాబాద్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ సాహిత్య సామ్రాట్ అన్నాబావు సాఠే 54వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణ మాంగ్ సమాజ్ అధ్యక్షుడు ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు విష్ణు, పట్టణ కమిటీ కార్యదర్శి కె.సాయి, కోశాధికారి సూర్యవంశీ సాయికుమార్, సమాజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ కులవృత్తుల పథకం ఎంపికలో అవకతవకలు



నవతెలంగాణ-దస్తురాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినటువంటి బీసీ కులవృత్తులకు రూ.లక్ష సాయం, బీసీబంధు పథకం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, సరైన విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని రేవోజిపేట్ గ్రామానికి చెందిన బీసీలు స్థానిక ఎంపీడీఓను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ కులవృత్తులకు రూ.లక్ష సాయం ఎంపికలో గ్రామసభ నిర్వహించకుండా సెక్రటరీ ఇష్టానుసారంగా వ్యవహరించి, కొందరికి కేటాయించడం పట్ల అసలైన లబ్ధిదారులు నష్టపోతున్నారని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు సాయం అందేలా చూడాలని తెలిపారు. అదే విధంగా ఎంపికలో అవకతవకలకు పాల్పడ్డవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం చుట్టూ వర్షపు నీరు

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆవరణలో గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఆస్పత్రి చుట్టూ పూర్తిగా వర్షపు నీరు చేరింది. మంగళవారం మండలంలోని ఆయా గ్రామంలో ఉన్న ప్రజలు వైద్య చికిత్సల కోసం వెళ్లంటేనే ఆస్పత్రి చుట్టూ పూర్తిగా నీరు చేరి, బురద మయంగా మారింది. దీంతో రోగులు ఆస్పత్రికి రావడానికి జంకుతున్నారు. ఈ సమస్య గత రెండు మూడు సంవత్సరాలుగా ఉన్నపటికీ అధికారులు నాయకులు చూసి చూడనట్లుగా వ్యవరించడం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు వైద్య చికిత్సల కోసం వస్తే ఎప్పుడు ఎలా ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకొని, సమస్యను పరిష్కారించి ఆస్పత్రి కి వచ్చే రోగులను కాపాడాలని అన్నారు.

రాజకీయ చైతన్య యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

నేతకాని మహర్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రాజకీయ చైతన్య యాత్ర పోస్టర్లను గజిటెడ్ ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు శ్యాం నాయక్ ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ చైతన్యం అందరిలో తేవాలని ఆలోచన రావడం ఎంతో అభినందనీయమని ఆయన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సీపీఐ నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ మావల మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం వర్షాన్ని లెక్కచేయకుండా గొడుగులు పట్టుకొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలు నుంచి పేదవారు పూరి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నప్పటికీ ఎలాంటి కనీస సౌకర్యాలు లేవన్నారు. జీఓ 58 ప్రకారం పట్టాలు ఇవ్వకపోగా కనీసం కరెంటు సౌకర్యం, మంచీనీటి సౌకర్యం కూడా లేదన్నారు. జిల్లా కేంద్రానికి ఆమడ దూరంలో ఉన్న ఇలాంటి పరిస్థితుల్లో ఉండటం చాలా దారుణమన్నారు. అనంతరం ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు.

నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-బెజ్జూర్



మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. 1-19 ఏండ్లలోపు పిల్లలకు నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని కోరారు. వైరల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ, హెచ్‌వి రేణుక, ల్యాబ్ టెక్నీషియన్ దిలీప్, బీఆర్ఎస్ నాయకులు జావిద్ అలీ పాల్గొన్నారు.

అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో నిర్వహించే కార్యక్రమాలకు అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం జాతీయ సంఘాల ఫిట్ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఏరియా వర్క్ షాప్‌లోని డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్‌లో నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో, సేఫ్టీ కమిటీ, వర్క్ కమిటీ మీటింగ్లలో అన్ని యూనియన్లకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. మంగళవారం నిర్వహించిన సేఫ్టీ కమిటీ మీటింగ్‌లో అన్ని సంఘాలు పాల్గొన్నాయని, రానున్న రోజుల్లో అధికారికంగా అన్ని సంఘాలను సమానంగా చూడాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంఘాల ఫిట్ కార్యదర్శులు ఏఐటీయూసీ సదానందం, బీఎంఎస్ పొడిశెట్టి వినోద్, హెచ్ఎంఎస్ అశోక్, ఐఎన్టీయూసీ రాయ స్వామి పాల్గొన్నారు.

మాల మహానాడు యూత్ జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ఎన్నిక

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



జాతీయ మాల మహానాడు మంచిర్యాల జిల్లా మాల యూత్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన దండు సదానందం మంగళవారం ఎన్నికయ్యారు. యూత్ అధ్యక్షుడు సుద్దమల్ల అశోక్ తేజ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన దండు సదానందం మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మీడియా రంగంలో పనిచేస్తున్న తనను గుర్తించి మాల యూత్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సంఘాన్ని బలోపేతం చేయడానికి సోషల్ మీడియా వేదిక ద్వారా ఎప్పటి కప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్తానని, నా పై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించాడానికి కృషి చేసిన మాల యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు సుద్దమల్ల అశోక్ తేజకు, జిల్లా అధ్యక్షులు గజ్జెల్లి లక్ష్మణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గజేల్లి రాయమల్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో హరితహారం



నవతెలంగాణ-నస్పూర్

సీసీ సింగరేణి పాఠశాలలో పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు సంయుక్తంగా మంగళవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్, డీజీఎం రాజేశ్వర్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్ రావు పాల్గొని మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేసి దాదాపు 170 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులైన డాక్టర్ జయలలిత(1985-86), డాక్టర్ కిషోర్‌రెడ్డి(1988-89) కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆరోగ్యం, జ్ఞాపక శక్తి పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతే కాకుండా పాఠశాలలో ఏర్పాటు చేసిన సంగీతం మాస్టారు జీతభత్యాల బాధ్యత ధాత్రి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత పూర్వ విద్యార్థి కట్టా రాఘవేంద్రరావు(87-88) ప్రకటించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ పూర్వ విద్యార్థి సంఘం పాఠశాల వేదికగా చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి దొనికెన సమ్మయ్య, సమన్వయకర్తలు సి.రాజారెడ్డి, కె.వాణిశ్రీ, కోశాధికారి డప్పు సమ్మయ్య, శ్యామ్ సుందర్‌రెడ్డి, జక్కుల మల్లేష్, గోశిక మనోజ్, కోరేపు తిరుపతి, నల్ల సంపత్, పెండ్లి సురేందర్, కృష్ణవేణి, రేఖా ఠాగూర్ పాల్గొన్నారు.

రైతులకు కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-హాజీపూర్

వ్యవసాయానికి 3గంటల విద్యుత్ చాలు అన్న కాంగ్రెస్ నాయకులు రైతులకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కర్ణమామిడి రైతు వేదికలో బీఆర్ఎస్ అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన చర్చా వేదికలో పాల్గొని ఆయన మాట్లాడారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తుంటే ఓర్వలేని రేవంత్‌రెడ్డి రైతులతో రాజకీయం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో వర్షాకాలం వచ్చిందంటే రైతులు ఎరువులు, విత్తనాల దుకాణాల ముందు చెప్పులు క్యూలో పెట్టిన సంఘటనలను గుర్తు చేశారు. ఎండాకాలం వచ్చిందంటే సబ్ స్టేషన్ ముందు రైతులు ధర్నాలు చేసిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కొట్టే మహేందర్, గోళ్ళ శ్రీనివాస్, అన్నం మధుసూధన్‌రెడ్డి, జాడి సత్యం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నహీం పాష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కోట సత్తయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి

నవతెలంగాణ-దండేపల్లి

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కచ్చితంగా నూలు పురుగు మాత్రలు వేయాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించేలా చూడాలని ఎప్పటికప్పుడు గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్‌తో శానిటేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి ఆవరణలో నీటి గుంతలలో నీటి నిలువ లేకుండా చూడాలని తద్వారా దోమల బారిన పడకుండా ఉండవచ్చని అన్నారు. వైద్యాధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతరావు, ఎంపీడీఓ మల్లేశం, మండల విద్యాధికారి రవీందర్, దండేపల్లి, తాళ్లపేట ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు సతీష్, క్రాంతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణి పాల్గొన్నారు.

భూమి హక్కు పత్రాలు ఇప్పించండి

నవతెలంగాణ-జన్నారం

పోరాడి సాధించుకున్న పోడు భూమికి హక్కు పత్రాలు ఇప్పించాలని మండ లంలోని గడ్డంగూడ గ్రామా నికి చెందిన బుక్యా బలిరాం నాయక్ కోరారు. తనకున్న 20 ఎకరాల భూమిని కుమారులు, ఇద్దరు కుమార్తెలకు పంచి ఇవ్వగా ఆ భూమిలో లక్ష్మీపూర్ తండాకు చెందిన కొందరు ఈ నెల 7న అక్రమంగా గుడిసెలు నిర్మించుకున్నారని చెప్పారు. భూమిలో ఉన్న పత్తి పంట పూర్తిగా ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు రక్షణ కల్పించి భూమికి హక్కు పత్రాలు ఇప్పించాలని అధికారులను కోరుతున్నారు.

నిషేధ వేళ..

మత్స్యకారులకు భరోసా ఎలా..?

- ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో మృతి చెందిన జాలరి
- చేపల వేటకు వెళ్లి గల్లంతు
- రెండు నెలల పాటు ఉపాధి కరువు
- పూట గడవని స్థితిలో కుటుంబాలు

చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో వారి జీవితాలకు భరోసా కరువవుతోంది. కుటుంబ పోషణ భారమై జాలరులు ప్రాణాలకు తెగిస్తున్నారు. పారుతున్న నదుల్లో, ప్రాజెక్టుల్లో చేపల వేటకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. చేపలు పునరుత్పత్తి దశలో ఉండటంతో మత్స శాఖ చేపల వేటను ప్రతి ఏట రెండు నెలల పాటు నిషేధిస్తుంది. దీంతో రెండు నెలల పాటు జాలర్లు ఉపాధి కోల్పోతున్నారు. ఈ క్రమంలోనే రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితిలో జీవనం సాగిస్తున్న భూమయ్య(62) ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. ఇలా ప్రతి ఏడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా తప్పని పరిస్థితిలో జాలరులు చేపల వేటకు వెళ్తున్నారు. నిషేధ సమంయంలో రెండు నెలల పాటు తమను ప్రభుత్వమే ఆధుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



నవతెలంగాణ-హాజీపూర్

గుడిపేట్ తెనుగు వాడకు చెందిన కంకణాలు భూమయ్య(62)ది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. చేపల వేటనే వత్తిగా కొనసాగుతున్న భూమయ్య ప్రస్తుతం రిజర్వాయర్లలో చేపల వేట నిషేధం తో కొద్ది రోజులుగా ఇంట్లోనే వుంటునాడు. దీంతో కుటుంబ పోషణ భారమైంది. సోమవారం ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో వలలు కట్టి వచ్చాడు. మంగళవారం ఉదయం వలకు పడిన చేపలను తీసుకొచ్చేందుకు ప్రాజెక్ట్‌లోకి బ్యాక్ వాటర్‌లోకి వెళ్ళాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. గమనించిన తోటి మత్స్యకారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెళ్లిన తహసీల్దార్ రాజలింగం, ఎస్సై నరేష్‌లు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ప్రయోజనం లేకపోవడంతో పాతాళగరిగే సహాయంతో గాలించటంతో మధ్యాహ్నం భూమయ్య మతదేహం లభించింది. మతునికి బార్య, ముగ్గురు కుమారులు, ఒక కూతురు వుంది. కుమారులలో ఒకరు వికలాంగుడు. కాగా సంతానం అందరికీ వివాహాలయ్యాయి.



మృతి చెందిన భూమయ్య

రెండు నెలల పాటు దుర్బర జీవితం

జులై నుంచి ఆగస్ట్ నెలాకరు వరకు చేపలు పునరుత్పత్తి దశలో వుంటాయని, వర్షాలు అధికంగా కురుస్తాయని ఆ సమయంలో మత్స్యకారులు రిజర్వాయర్లలో, పెద్ద చెరువుల్లో, నదుల్లో చేపల వేట చేయరాదని మత్స్యశాఖ నిషేధం విధిస్తుంది. రోజు వారిగా చేపలు పట్టి అమ్ముకుని కుటుంబాలను పోసించుకునే మత్స్యకారులకు ఈ రెండు నెలలు జీవనోపాధి కోల్పోతున్నారు. చేపల వేట సాగిస్తేగాని కుటుంబ పోషన సాగని మత్సకారుడు సాధారణ రోజుల్లోనే సంపాదించే రూ. 100, రూ.200తో జీవనం సాగిస్తారు. ఈ అదీ కూడా లేకపోవడంతో పస్తులు వుండే పరిస్తితుల్లో కొందరు చేపల వేటకు పోయి దొరికిన కొద్ది చేపలు అమ్మితే వచ్చే దానిలో కొంత వాటా కోసం అధికారుల వేధింపులు బరించి ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారుల వేదింపులు తాళలేక కొందరు చేపల వేటకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉంటూ అర్థాకలితో కాలం వెల్లదీస్తున్నారు.

జిల్లాలో 9500మంది మత్స్యకారులు

మంచిర్యాల జిల్లాలో అధికారుల లెక్క ప్రకారం 6500మంది లైసెన్స్ కలిగిన మత్స్యకారులు ఉన్నారు. వీరు కాక మరో 3000ముంది మత్స్యకారులు ఉన్నారు. మొత్తంగా జిల్లాలో చేపల వేటపై ఆధార పడిన వారు 9500మంది వరకు ఉంటారు. జిల్లాలో 105మత్స్యకార సహకార సంఘాలు ఉన్నాయి. 5వేల కుటుంబాలు చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరు నిత్యం జిల్లాలోని ఆయా ప్రాజెక్ట్‌లు, చెరువుల్లో చేపల వేట చేస్తూ దొరికిన కొద్ది చేపలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వలల రేటు పెరిగింది. వారానికోసారి వలలు మార్చాల్సి వస్తుంటుంది. ఇలా వీరి పెట్టుబడి పోను రోజు మిగిలేది మూడు వందల లోపే.. ఒక్కో రోజు చేపలు పడకపోతే అదీ కూడా మిగిలేది లేదు. పట్టిన చేపలను దళారులకు అమ్మితే మిగిలేది తుట్టికి పావుసేరే..

నిషేధ సమయంలో ఆర్థిక భరోసా కల్పించాలి

జులై నుండి ఆగస్ట్ వరకు చేపల వేట నిషేధం అని అధికారులు నోటీస్‌లు ఇస్తున్నారు. అదికూడా ఆ సమయంలో చేపలు పునరుత్పత్తి దశలో ఉంటాయి కాబట్టి మత్స్యకారులు కూడా సహకరిస్తున్నారు. కానీ ఈ రెండు నెలలు వారి కుటుంబ పోషణ కోసం తిప్పలు పడుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం ఒక్కో మత్స్యకారునికి నెలకు రూ.10 వేల చొప్పున రెండు నెలలు రూ.20 వేల ఆర్థిక భరోసా ప్రభుత్వం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

బోదెంకి చందు, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి.



ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో మృతి చెందిన మత్స్యకారుని కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి. రెండు నెలలు చేపల వేట నిషేదంతో మత్స్యకారులు ఉపాధికి దూరంగా ఉండాల్సి వస్తుంది. పూట గడవడం కష్టాంగ మత్సకార కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ రెండు నెలలు ఉపాధి ఉండదు కాబట్టి ప్రభుత్వమే నెలకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20 వేలు ఆర్థిక సాయం ఇవ్వాలి. అలాగే మత్స్యకారులపై ఆ శాఖ అధికారుల వేధింపులు ఆపాలి.

నిషేధ సమయంలో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు

ఎం.సత్యనారాయణ. ఫిషరీస్ ఏడీ.మంచిర్యాల జిల్లా

జూలై, ఆగస్ట్ నెలలో చేపలు పునరుత్పత్తి దశలో వుంటాయి. వర్షాలు కురవడంతో ప్రవాహం అధికంగా ఉంటుందని చేపల వేట నిషేదాజ్ఞలు విదిస్తాం. ముందస్తుగా నోటీసులు కూడా జారీ చేస్తాం. అయిన వినకుండా వేటకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు.

భారీ వర్షంలో కొనసాగిన జీపీ కార్మికుల నిరసన

- 13వ రోజు ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు గత 12 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా 13వ రోజు మంగళవారం జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల న్యాయమైనటువంటి డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరోగ్యాలను చెడగొట్టుకుంటూ అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నామన్నారు. అటువంటి తమ మీద కక్ష సాధింపు చర్యలు సరైనవి కాదన్నారు. మల్టీపర్పస్ విధానంతో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 13 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం దారుణం అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూనే తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, గ్రామపంచాయతీ కార్మికులు రాజు, సమ్మయ్య, శంకర్, మహేష్, సాబీర్, నగేష్, విలాస్, కైలాస్, యమునభాయ్, పద్మ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 13 రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా చూడాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా వర్షంలో తడుస్తూనే కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో అతని కుమారునికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు బి.రమేష్, రవి, దర్మ, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

రెబ్బెన : సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. మంగళవారంతో సమ్మె 13వ రోజుకు చేరుకున్నా తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను శ్రమదోపిడికి గురిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ కార్మికులకు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, శంకర్, శ్రీనివాస్, బాలాజీ, సత్యనారాయణ, దేవాజీ, లక్ష్మి పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ లో..

ఏరియర్స్ గతం నుండే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను ఈ నెల నుండి అమలు చేస్తామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యద్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని మంగళవారం స్థానిక ప్రయివేట్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచుతామని గతంలోనే సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారని, పెంచిన వేతనాలు అప్పటి నుండే అమలు చేస్తూ ఏరియర్స్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించేంతవరకు పాత మెనూనే కొనసాగించాలని, గుడ్డుకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని లేదా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసినట్లుగా మధ్యాహ్న భోజన పథకానికి కూడా సరఫరా చేయాలని ఈ సమావేశంలో తీర్మాణించినట్లు తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ సీఐటీయూ చేపట్టిన అనేక పోరాటాల ఫలితంగానే నేడు వేతనాలు పెరిగాయని అన్నారు. ఇతర సమస్యల పరిష్కారానికి ఇదే పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్కరి పార్వతి, మడావి చంద్రకళ, విమల, బుజ్జమ్మ, మీరాబాయి, కొడిపె భీంబాయి, అనసూయ, ఆలం పులాబాయి పాల్గొన్నారు.



పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

- మండలంలో కలెక్టర్, ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



నవతెలంగాణ-బెజ్జూర్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెంచికల్‌పేట్ రోడ్డు మార్గంలోని సులుగుపెల్లి గ్రామ సమీపంలోని తీగల ఒర్రె వద్ద తాత్కాళిక రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే సలుగుపెల్లి గ్రామ సమీపంలోని ఒర్రె వద్ద కూడా తాత్కాళిక రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలించారు. వంతెన పూర్తయిన అప్రోచ్ పూర్తికాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అప్రోచ్‌ను త్వరగా పూర్తిచేయాలని సదరు కాంట్రాక్టర్‌లకు ఆదేశించారు. రేపటిలోగా రాకపోకలు ప్రారంభమవుతాయని, అప్రోచ్ రోడ్డు పనులను ప్రారంభించినట్లు కలెక్టర్, ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం బెజ్జూర్‌లోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను కేజీబీవీ ప్రిన్సిపల్ అరుణను అడిగి తెలుసుకున్నారు. 330 మంది విద్యార్థులు ఉన్నందున మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపోవడంలేదని, అదనంగా మరో 10 మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని, 150 మంది కెపాసిటీతోనే డైనింగ్‌హాల్ ఉందని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దగ్గరలో అసంపూర్తిగా ఉన్న బీసీ వసతిగృహంలో డైనింగ్‌హాల్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ప్రిన్సిపల్ కోరారు. దీనికి కలెక్టర్ స్పందించి మరుగుదొడ్లు, మూత్రశాలలు మంజూరు చేయడంతో పాటు డైనింగ్‌హాల్ తాత్కాలికంగా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. అదనపు గదులు మంజూరు చేయాలని వార్డెన్ పార్థిరాం కలెక్టర్‌ను కోరారు. పరిశీలించి అదనపు గదుల మంజూరు కోసం కృషి చేస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ ఈఈ రామ్మోహన్, కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, తంగెడిపెల్లి మహేష్ ఉన్నారు.

కౌటాల : మండలంలో సోమవారం నుండి మంగళవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ఎవరు ఇండ్ల నుండి బయటకు కూడా వెళ్లలేకపోయారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతుండగా కుంటలు నిండుకుండలా మారాయి. మండలకేంద్రానికి ప్రక్కనే ఉన్న తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత, వార్దా నది పొంగిపొర్లుతోంది.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక



నవతెలంగాణ-హాజీపూర్

ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ప్రజా వేదిక, సామాజిక తనిఖీ కార్యక్రమాలు నిర్వహించారు. డీఆర్‌డీఓ శేషాద్రి అధ్యక్షతన ఉపాధి హామీ పథకం రెండవ విడత సామాజిక తనిఖీ చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో వివరాలు సరిగ్గా నమోదు చేయడం లేదనే విషయం సామాజిక తనిఖీలో వెల్లడైంది. మండలంలోని 17 గ్రామాల్లో గత ఆర్థిక సంవత్సరం 835 పనులు, రూ 6.74 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు జరిగాయి. వీటిపై గ్రామానికి ఎస్సార్పీ, డీఆర్పీలు, సామాజిక కార్యకర్తలు ఇటీవల ఆడిట్ నిర్వహించారు. కాగా ప్రజా వేదికలో పలు తప్పుడు లెక్కలు వెలుగులోకి వచ్చాయి. ప్రజల కోసం కొసాగుతున్న ఉపాధి హామీ పథకం తప్పుల తడకగా మారిందని తనిఖీ లో తేలింది. పనుల విషయంలో కానీ కొలతలు, రికార్డులు అన్ని విషయాల్లో లోపాలు ఉన్నాయని, గ్రామాల వారిగా జరిగిన పనుల్లో తప్పిదాలను అధికారుల సమక్షంలో సామాజిక కార్యకర్తలు తేల్చి చెప్పారు. సదరు పనుల్లో ఉపాధిహామీలో సంతకాలు లేకుండానే చెల్లింపులు జరిపినట్లు తేలింది. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో గతలో నిర్మించిన కల్లాలు వివరాలు నమోదులో కొలతల తేడాపై చర్చ జరిగింది. కాగా ఎప్పుడో జరిగిన పనులకు ఇప్పుడు కొలతలు వేస్తే తప్పుడు లెక్కలు వస్తాయని అధికారులు ధృవీకరించారు. ప్రజాప్రతినిధులు ఇలా తప్పుడు లెక్కలు చూపితే సహించేది లేదన్నారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేసేలా చూడాలని ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకుపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, ఎంపీడీఓ మహ్మద్ అబ్దుల్ హై, ఏపీఓ మల్లయ్య, ఎస్ఆర్పీ బృంధం, సామాజిక తనిఖీ బృందం నరేందర్, ఎంపీఓ శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నయీం పాషా పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పెంచికల్‌పేట్, దహెగాం మధ్య గల పెద్దవాగుపై నిర్మించిన వంతెన వద్ద అప్రోచ్ రోడ్డును ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కలెక్టర్ బొర్కాడే హేమంత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని, అప్రోచ్ రోడ్డు కూలిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అంతకుముందు మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించారు. ప్రత్యేక అధికారి కవితను పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పాఠశాల ముందు ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే అన్నారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోపాల్ ఉన్నారు.

కళాశాల అభివృద్ధికి అధ్యాపకుల విరాళం

వాంకిడి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరణ చేసినందుకు గాను మండలంలోని జూనియర్ లెక్చరర్లు కళాశాల అభివృద్ధికి ఒక్కొక్క లెక్చరర్ తనవంతు సాయంగా రూ.10 వేల చొప్పున మొత్తం రూ.80 వేలు కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌కుమార్‌కు మంగళవారం అందజేశారు. స్థానిక లెక్చరర్లు కళాశాల అభివృద్ధికి తమవంతు సహకరించడంతో లెక్చరర్లకు ప్రిన్సిపల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు, రేపు రైల్వే గేటు మూసివేత

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

సిర్పూర్ నుండి కాగజ్‌నగర్‌కు వెళ్లే మార్గమధ్యలో రైల్వేగేటు మూడో లైను పనులు సాగుతున్న నేపథ్యంలో రైల్వే శాఖ అధికారుల ఆదేశాల మేరకు బుధ, గురువారాల్లో 24 గంటల పాటు రైల్వేగేటును మూసివేస్తున్నట్టు ఎస్సై దీకొండ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ రాత్రి 10 గంటల నుండి 20వ తేదీ రాత్రి 10 గంటలకు రైల్వేగేటు మూసి వేస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులు సిర్పూర్ నుండి కాగజ్‌నగర్‌కు వెళ్లే వాహనదారులు పెద్దబండ నుండి వెడమవైపు ఉన్న అచ్చెల్లి, చింతకుంట, చుంచుపెల్లి, అనకోడ, బెంగాలీక్యాంప్ మీదుగా కాగజ్‌నగర్‌కు వెళ్లాలని, కాగజ్‌నగర్ నుండి సిర్పూర్(టి)కి వచ్చే వాహనదారులు కాగజ్‌నగర్ ఎన్‌టీఆర్ చౌక్ నుండి ఫ్లైఓవర్ మీదుగా బెంగాలీ క్యాంప్, అనకోడ, చుంచుపెల్లి, చింతకుంట మీదుగా వెళ్లాలని ఎస్సై తెలిపారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని వినతి

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామం నుంచి మంగళవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్వర్ణలత సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆ గ్రామ గిరిజనులు (మన్నేవార్, నాయక్‌పోడ్) దాదాపు 150 కుటుంబాలతో కలిసి ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయికి వినతి పత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా కొట్టుకుని సాగు చేసుకుంటున్న అటువంటి భూమిని ఇప్పుడు అటవీ శాఖ అధికారులు అడ్డంకులు సృష్టిస్తూ సాగు చేసుకోనివ్వటంలేదని తెలిపారు. ఇట్టి భూములకు వెంటనే పోడు పట్టాలు ఇప్పించి అటవీ శాఖ అధికారుల నుంచి రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్‌కుమార్, నీల్వాయి సర్పంచ్ గాలి మధు, పున్నం చందు, మధుసూదన్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలపై మంత్రి సమీక్ష



నవతెలంగాణ-నిర్మల్

సంక్షేమ పథకాలపై మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రజల కొరకు అమలు చేస్తుందన్నారు. వివిధ శాఖల సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పథకం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ లక్ష్యాలను చేరుకోవాలని, జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని నిర్మిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భూమి పూజ ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగారేణి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపింది కేసీఆరే

- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్‌రావు



నవతెలంగాణ-రెబ్బెన

ఇచ్చిన మాటకు కట్టుబడి సింగరేణిలో వీఆర్ఎస్ అమలు చేసి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపింది సీఎం కేసీఆరేనని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్‌రావు అన్నారు. మంగళవారం ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో గేట్ మీటింగ్‌ను టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా కార్మికులను మెడికల్ ఇన్వాలిడేశన్ ద్వారా దాదాపు 15 వేల మంది యువ కార్మికులు సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాడని గుర్తు చేశారు. కార్మికులకు ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులో హౌజింగ్ రుణం తీసుకుంటే ఇంటి రుణంపై రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాన్ని యాజమాన్యమే చెల్లించే విధంగా సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. 1 శాతం కరెంటు బిల్లు కార్మికుడికి బేసిక్స్ మీద కటింగ్ ఉంటే అది కూడా మాఫీ చేయడంతో పాటు ఉచిత ఏసీ సౌకర్యం కూడా కల్పించారన్నారు. తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం ఇవ్వడమే కాకుండా తెలంగాణ వచ్చిన వెంటనే అన్‌ఫిట్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు రాని పెండింగ్‌లో ఉన్న 3500 మందికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు నెలకు 500 మంది చొప్పున కొద్ది నెలల్లో అందరికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా సింగరేణికి ఎక్కువ లాభాలు రావడం వల్ల రూ.700 కోట్ల లాభాలను ఈ సంవత్సరం కార్మికులకు పంచబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, లెవన్‌మెన్ కమిటీ మెంబర్ మంగీలాల్, సెంట్రల్ కమిటీ నాయకులు జుమ్మి రాజలింగు, వెంకటరమణ, జీఎం కమిటీ మెంబర్ గజ్జెల్లి చంద్రశేఖర్, మారిన వెంకటేశం, ఏరియా నాయకులు అలవేని సంపత్, సోకాల శ్రీనివాస్, అసిస్టెంట్ కార్యదర్శి మసాడి నారాయణ, భాస్కరాచారి, గొల్ల కృష్ణ, కమిటీ సభ్యులు వామన్, కిరణ్, రాజేశం, తిరుపతి, మధు, రాజమల్లు పాల్గొన్నారు.

కుల వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

- విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మల సంఘ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల అభ్యున్నతికి ఎమ్మెల్యేగా ఎల్లవేళలా పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని కైలాష్‌నగర్‌లో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల సంఘ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సంఘ సభ్యులతో కలిసి ప్రారంచారు. సృష్టి గురువు విశ్వబ్రాహ్మణ ఆశీస్సులతో పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరారు. అలాగే విశ్వబ్రాహ్మణ కులవృత్తి నైపుణ్యత పట్ల ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు. కుల వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలందిస్తూ వారికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులునర్సిములు, స్వామి, కిష్టయ్య, టీఆర్ఎస్ అధికార ప్రతినిధి గంగారెడ్డి, దుర్గం శేఖర్, రామ్‌కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

20న చలో ఎస్పీడీ ఆఫీస్

నవతెలంగాణ - హాజీపూర్

కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో జులై 20న చలో ఎస్పీడీ ఆఫీస్ నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్ల రామన్న, గుర్రాల రాజావేణు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తోందన్నారు. ఇప్పటి వరకు వివిధ రూపాల్లో నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. 20న చలో ఎస్పీడీ ఆఫీస్ కార్యక్రమానికి కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని సంఘటిత శక్తిని, పోరాట పటిమను ప్రభుత్వానికి తెలియజేయాలని పేర్కొన్నారు.

సిర్పూరులో రాజకీయ వేడి

- ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్న నాయకుల ఆరోపణలు, ప్రత్యారోపణలు

బీఆర్ఎస్ ప్రభుత్వ గడువు ఇంకా ముగియలేదు. ఎన్నికల షెడ్యూలు రాలేదు. వీటన్నింటికి ఇంకా ఐదారు నెలల సమయముంది. అయినా సిర్పూరు(టీ) నియోజకవర్గంలో మాత్రం రేపో మాపో ఎన్నికలు ఉన్నట్లుగానే రాజకీయ వేడి ఊపందుకుంది. మార్కెట్‌లో ఎక్కడ చూసినా రాజకీయ చర్చలే కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో ప్రస్తుతమున్న ప్రధాన పార్టీ నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కూడా ఊపందుకున్నాయి.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి నియోజకవర్గం సిర్పూరు(టి) నియోజకవర్గం. ఈ నియోజకవర్గంపైనే ఇపుడు ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. దీనికి ప్రధాన కారణం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి నుండి పోటీ చేస్తానని ప్రకటించడమే. ఆయన పోటీ చేస్తానని ప్రకటించిన రోజు నుండి ఇక్కడ రాజకీయ వేడి ఊపందుకుంది. ఈ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఉన్నారు. అధికారికంగా ఇతనికి టిక్కెట్ ప్రకటించకపోయినా, ఇక్కడ మరో నాయకుడు లేకపోవడంతో అతనికే టిక్కెట్ ఖరారు అనేదానిలో సందేహం లేదనే చర్చ కొనసాగుతోంది. గత కొన్ని రోజుల నుండి బహుజన సమాజ్ పార్టీని ఈ నియోజకవర్గంలో స్థానిక నేతలు బలోపేతం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను తరచుగా ఇక్కడికి తీసుకువస్తూ కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవలనే ఆయన తాను ఇక్కడి నుండే పోటీ చేయనున్నట్లు ప్రకటించడమే కాకుండా గత పది రోజులుగా ఇక్కడే మకాం వేసి విస్తృతంగా పర్యటిస్తూ తనను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారమే ప్రారంభించారు. ఇక బీజేపీ నుండి ఇద్దరు ప్రధానంగా టిక్కెట్ రేసులో ఉన్నారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ నుండి పోటీ చేసిన డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అనంతరం బీజేపీలో చేరాడు. ముందు నుండి ఆ పార్టీలో ఉన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ కూడా ఈ పార్టీ నుండి టిక్కెట్ ఆశిస్తున్నారు. ఇందులో పాల్వాయి హరీష్‌బాబు టిక్కెట్ తనకే వస్తుందనే ధీమాతో గ్రామాలలో పాదయాత్రలు చేస్తూ ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నాలు చేస్తుండగా, డాక్టర్ శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ టిక్కెట్ తనకేననే ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో కూడా వర్గపోరు అధికంగా ఉన్నట్లు బహిర్గతంగానే అర్థం అవుతోంది. ఇక్కడ బీజేపీ నుండి కాంగ్రెస్‌లో చేరిన రావి శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు కోరళ్ల కృష్ణారెడ్డి టిక్కెట్ రేసులో ఉన్నారు. వీరిద్దరూ ఎవరికి వారే నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.

ఊపందుకున్న ఆరోపణలు, ప్రత్యారోపణలు

బీఎస్పీ రంగంలోకి దిగకముందు బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, అధికార పార్టీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పల మధ్య తీవ్ర ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉండేవి. నియోజకవర్గంలో ఈ రెండు పార్టీల మధ్యే తీవ్ర పోటీ ఉంటుందని భావించారు. కాని ఇపుడు సీన్ మారింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రంగ ప్రవేశంతో నియోజకవర్గంలో ఇప్పటికైతే త్రిముఖ పోటీకి అవకాశముంది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వచ్చీ రావడంతోనే ఎమ్మెల్యే కోనేరు కోనప్పను టార్గెట్ చేస్తూనే ఆరోపణలు చేయడం ప్రారంభించారు. దీనితో ఎమ్మెల్యే కూడా పరోక్షంగా ఆర్ఎస్‌పీని టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేయడంతో ఇద్దరి మధ్య ఆరోపణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. కాగజ్‌నగర్‌లో తనకు ఇల్లు ఉందని, హైదరాబాద్ నుండి వచ్చిన నాయకుని ఇంటి అడ్రస్ ఏందని కోనేరు కోనప్ప పరోక్షంగా ఆర్ఎస్‌పీపై విమర్శలు చేయగా, ఆంధ్రా నుండి వచ్చిన ఎమ్మెల్యే లోకల్ ఎలా అవుతాడని, తెలంగాణవాసిగా నేను ఈ ప్రాంతానికి లోకల్ అని ఆర్ఎస్‌పి తీవ్రంగా చేసిన ఆరోపణలు ఇపుడు నియోజకవర్గంలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సమస్యలపై పోరాటాలు చేస్తూ అధికారపార్టీ ఎమ్మెల్యేపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. ఎమ్మెల్యే నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తూ బీజేపీ నాయకులు చెడిపోయిన రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపారు. రెండేళ్ల క్రితం అందవెల్లి వంతెన కూలినా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు బ్రిడ్జి దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే ఇసుక మాఫియా కారణంగానే వందేళ్ల పాటు మన్నికగా ఉండాల్సిన వంతెన కుప్పకూలిందని హరీష్‌బాబు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఇటు బీజేపీ, అటు బీఎస్పీ రెండు పార్టీలు కూడా అధికారపార్టీ ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తుండడాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏది ఏమైనా నియోజకవర్గంలో నాయకుల ఆరోపణలు, ప్రత్యారోపణలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్నాయి.







ఎమ్మెల్యేలకు గ్రామ పంచాయతీ కార్మికుల వినతి

- సీఎం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యేల హామీ





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. కార్మికులు ర్యాలీగా వెళ్లి ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావులను కలిసి వినతిపత్రాలు అందించారు. వీరి వెంట సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న ఉన్నారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలు స్వచ్ఛంగా ఉండడానికి తమ ఆరోగ్యాలను సైతం ఫణంగా పెట్టి పని చేస్తున్నారన్నారు. కార్మికుల కష్టం ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టిలో ఉందన్నారు. త్వరలోనే ప్రభుత్వం నుండి తీపి కబురు అందుతుందన్నారు. ముఖ్యమంత్రి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని, పంచాయతీ కార్మికులకు కూడా తప్పకుండ న్యాయం చేస్తారని విశ్వాసం ఉందన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ మండల నాయకులు కార్మికులు పోశెట్టి, లక్ష్మన్న, అడెల్లు, గంగన్న, పోశెట్టి, రమేష్, శంకర్, శ్రీకాంత్, రాజు, అశోక్, దశరథ్, లింగన్న, లింగారెడ్డి, అశోక్, రామక్క, రాధ పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకం

- మంచిర్యాల కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమైందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్ నాయక్, బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి. గౌతమి, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు దాసరి వేణు, శ్యామలాదేవితో కలిసి అసెంబ్లీ, జిల్లా స్థాయి శిక్షకులతో ఓటరు జాబితా రూపకల్పనపై బూత్ స్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. బిఎల్ఓ యాప్, ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమైందన్నారు. జిల్లాలో 2వ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు, ఆపరేటర్లకు అందిస్తున్న ఈ శిక్షణను పూర్తి స్థాయిలో నేర్చుకుని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సవరణలు, చిరునామా మార్పులు, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపులు సంబంధించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని తెలిపారు.



ఆసిఫాబాద్ : ఎన్నికల నిర్వహణలో స్పష్టమైన ఓటరు జాబితా ఎంతో ముఖ్యమని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, డిఆర్ఓ రాజేశ్వర్‌తో కలిసి ఫొటో ఓటరు జాబితా రూపకల్పనపై ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్షించారు. ఎఎల్ఎంటి, డిఎల్ఎంటి శిక్షణ పొందిన వారు బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చే సమయంలో ఓటరు జాబితా రూపకల్పన, ఓటు విలువ తెలియజేయాలని తెలిపారు. 2వ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతున్నందున జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, దివ్యాంగులు, ఆదివాసీ, ట్రాన్స్ జెండర్లు అర్హత గల వారి అందరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా శ్రద్ధ వహించాలని తెలిపారు. ఓటరు జాబితా కచ్చితంగా, సమర్థవంతంగా ఉన్నప్పుడే ఎన్నికలు సజావుగా సాగుతాయని తెలిపారు. ఓటరు జాబితా తయారు చేయడంలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమైందని, వారికి శిక్షణ ఇచ్చే సమయంలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు.

'రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు'



నవతెలంగాణ-ఉట్నూర్

రాహుల్ గాంధీని విమర్శించే అర్హత కేటిఆర్‌కు లేదని ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, న్యాయవాది పెందూర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ రైతు సంక్షేమానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. దేశంలో వ్యవసాయ అభివృద్ధిని పెంచి వరి, ఇతర ధాన్యాలను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబంలో జన్మించిన రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత మంత్రి కేటిఆర్‌కు లేదన్నారు. రాష్ట్రంలోని శ్రీశైలం, నాగార్జునసాగర్, మానేరు, శ్రీరామ్‌సాగర్, కడెం లాంటి అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణమయ్యాయని తెలిపారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది సీఎం కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. జోడో భారత్ పాదయాత్ర ద్వారా రైతు, బడుగు, బలహీన వర్గాలు సమస్యలు, బాధలు తెలుసుకున్న రాహుల్ గాంధీ గురించి తండ్రి చాటున రాజకీయాలు చేస్తున్న కేటిఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా మాట తప్పి ఎరువులకు సబ్సిడీ, గిట్టుబాటు ధర కల్పించని కేసీఆర్ ప్రభుత్వం రానున్న రోజుల్లో కూలడం ఖాయమన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



హుడ్కిళి గ్రామానికి చెందిన విద్యార్థి కిర్మిరె విలాస్(19) హుడ్కిళి నుండి కాగజ్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో సిర్పూర్ శివారులో రైస్‌మిల్లు వద్ద టిప్పర్ ఢీ కొని మృతి చెందినట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం తన సొంత పని మీద ఇంటి నుండి కాగజ్‌నగర్‌కు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో గొల్లవాడ నందు బీటీ రోడ్డుపై కాగజ్‌నగర్ వైపు కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను దాటుతున్న క్రమంలో తన మోటార్‌సైకిల్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ టిప్పర్‌ను వెనుక నుండి ఢీ కొట్టగా తల నుదిటిపై తీవ్ర గాయాలు అయ్యాయి. అయినప్పటికీ మళ్లి వాహనాన్ని నడుపుతూ కాగజ్‌నగర్‌కు వెళ్లడానికి సిద్ధం కాగా కొంతమంది వ్యక్తులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పినప్పటికీ వినకుండా తిరిగి మోటార్‌సైకిల్‌పై వెల్లాడు. సిర్పూర్ శివారు ప్రాంతంలో గల శ్రీలక్ష్మీభార్గవి రైస్‌మిల్లు వద్ద అదుపుతప్పి స్పృహ కోల్పోయాడు. దీనిని గమనించిన కొంతమంది విద్యార్థి పెదనాన్న కిర్మరె శ్యాంరావుకు సమాచారం ఇవ్వగా వెంటనే సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి తండ్రి కిర్మరె బాపురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై రక్షణ అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై కార్మికులకు మంగళవారం రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలో, ప్రమాదాలు ఎలా నివారించాలి అంశాలపై బెల్లంపల్లి జనరల్ మేనేజర్ (సేఫ్టీ) గుప్త అవగాహన కల్పించారు. రక్షణ ప్రతి క్షణం, ప్రతి నిమిషం ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి సంతోష్‌రావు, టీబీజీకేఎస్ ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ కారుకురి తిరుపతి, గొల్ల శ్రీనివాస్, ఇంజనీర్లు భీమ్‌రెడ్డి రఘు, నంద కిశోర్, సర్వేయర్ ప్రకాష్‌రావు, వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్ పాల్గొన్నారు.

బీజేపీ టిఫిన్ బైటక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో బిజెపి తాలుకా కన్వీనర్ సొల్లు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన టిఫిన్ బైటక్ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మారాంనాయక్, క్రిష్ణకుమారి, ఉపాధ్యక్షులు గుల్బం చక్రపాణి, పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, రెబ్బెన మండల అధ్యక్షులు గోలెం తిరుపతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొమురం వందన, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందడే సుధాకర్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ విజయ, సీనియర్ నాయకులు సుదర్శన్‌గౌడ్, రాంబాబు, రాధిక, ఓదేలు, కనకయ్య పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని వివిధ గ్రామాల్లో ఫెర్టిలైజర్ షాపులను వ్యవసాయ శాఖ ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్, ఏఓ దేవులపల్లి వందన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫెర్టిలైజర్ షాపుల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. దీంతో పాటు రిజిస్ట్రేషన్, లైసెన్సులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్లో ఎంటర్ చేయాలని, ఎటువంటి సమస్యలు లేకుండా ఉంచాలని సూచించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 19 జులై 2023

ఉత్తమ ప్రధానోపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని హర్కాపూర్(ఎ) పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న గేడం శ్రీరామ్‌కు ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందజేసింది. మంగళవారం పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్ రాథోడ్, యూటీఎఫ్ మండల ఉపాధ్యక్షులు మెస్రం రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగికి వృత్తిలో నైపుణ్యంతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. దానిలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైందని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అడే ప్రేమ్‌దాస్, పవార్, అంబాజీ, రాథోడ్ రాజేశ్వర్, నరేష్ పాల్గొన్నారు.



పార్టీలకతీతంగా వేణుగోపాలచారి సేవలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారులు సముద్రాల వేణుగోపాల చారి మంగళవారం మండలకేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగ ఆయనను స్థానిక ఎస్‌వీజీ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కారించింది. పార్టీలకు అతీతంగా చారి సేవలను అందిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు నారాయణ, స్థానిక సర్పంచ్ ముత్యంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రామిరెడ్డి, బిట్లింగ్ నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ భోజన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కడ్కి గ్రామ ప్రజల సమస్యలు పట్టించుకోవాలి

నవతెలంగాణ-బేల

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేండ్లు కావస్తున్న మండలంలోని కడ్కి గ్రామ ప్రజలు నేటికీ సమస్యలతో సతమతమవుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రుపేష్‌రెడ్డి పేర్కొన్నారు. కడ్కి గ్రామం గణేష్‌పూర్ గ్రామపంచాయతీలో ఉండటం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో 300కు పైగా జనాభా ఉన్నప్పటికీ వీరు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గణేష్‌పూర్ గ్రామపంచాయతీలో ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. మంగళవారం బేల మండలంలోని కడ్కి గ్రామానికి వెళ్లి స్థానిక ప్రజలతో కలిసి వారు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కడ్కి గ్రామంలో సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తూ, సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని గ్రామ ప్రజలకు భరోసా కల్పించారు. ఆయన వెంట నాయకులు ఘనశ్యామ్, గోడే అవినాష్, దైర్యవాన్, చంద్రకాంత్ మడావి, విపిన్ ఠాక్రే, సుమిత్, రాకేష్, నరేందర్ పాల్గొన్నారు.

ప్రత్యేక క్లినిక్‌లు మహిళలకు వరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ప్రత్యేక మహిళా క్లినిక్‌లు మహిళలకు వరమని ఆరోగ్య మహిళ క్లినిక్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జాన్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని హమాలివాడ పట్టణ ఆరోగ్య కేంద్రం, బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న మహిళా ఆరోగ్య క్లినిక్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మహిళలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సిడాం శంభు వర్ధంతిని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తుడుందెబ్బ వ్యవస్థాపకుడు, ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు సిడాం శంభు 5వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ కదిలి రావాలని తుడుందెబ్బ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరాలు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 20న ఉట్నూర్ మండలం మత్తడిగూడలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

నవతెలంగాణ-సిరికొండ

వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హేమాబిందు అన్నారు. మంగళవారం మండలంలోని రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి, మందులను పంపిణీ చేశారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగారాం, సుశీల పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ బీజేపీ కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 2018లో ఇచ్చిన హామీ రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ ఒకే సారి రుణమాఫీ చేస్తామని చెప్పి నాలుగున్నర యేండ్లు గడుస్తున్నా ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫసల్ భీమా యోజనను ఆదిలాబాద్‌లోని రైతులకు లబ్ది చేకూర్చాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తామని అన్నారు. అనంతరం ఆర్డీఓ రాథోడ్ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్, నాయకులు జోగు రవి, ఆకుల ప్రవీణ్, రఘుపతి, మహేందర్, సోమ రవి, దినేష్, విజయ్, రాజేష్ ఉన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే : కంది శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-జైనథ్

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్ని సర్వే ఫలితాల్లో మనమే ముందున్నామని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నిరాల గ్రామంలో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తరోడా బ్రిడ్జి కూలిపోయే దశకు చేరుకోవడంతో బేల, జైనథ్ మండలాల ప్రజలు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇది ముమ్మాటికీ జోగు రామన్న పాపమేనని అన్నారు. దుర్మార్గపు పాలన సాగిస్తూ ప్రజలను మాయమాటలతో నమ్మించి మభ్యపెడుతున్నారని అన్నారు. 14 ఏండ్లుగా రాజ్యమేలుతున్నారని అన్నారు. ఐదేండ్లు మంత్రి పదవీలో ఉండి జిల్లాకు ఏం చేశారంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మళ్లీ మంచి రోజులు రావాలంటే తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్, సాత్నాల ప్రాజెక్ట్ మాజీ చైర్మెన్ అల్లూరి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సుదర్శన్, మాజీ ఎంపీటీసీ రాజన్న యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పెంద్రే దిలీప్, బేల మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, బేల మండల మాజీ ఎంపీపీ బాపూరావు హుల్కె, నాగర్కర్ శంకర్, పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-సిరికొండ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఫకీర్ నాయక్ తండ గ్రామంలో త్రీ ఫేస్ కరెంట్‌ను ప్రారంభించారు. అనంతరం లచ్చింపూర్(బి) గ్రామ సమీపంలోని రైతు వేదికలో రైతులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆమె మాట్లాడారు. నిరంతర విద్యుత్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. వ్యవసాయ రంగానికి ఇతర సంస్థలకు నిరంతర విద్యుత్ అందించడంతో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెరిగాయని అన్నారు. గతంలో కరెంటు కోతలతో ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మొద్దని అన్నారు. ఎన్నికల సమయంలో గ్రామాలలో తిరుగుతూ అధికార పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తారని ప్రజలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీరామ్ నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు లచ్చిరామ్, అనిల్, నర్మద, మండల బీఆర్ఎస్ నాయకులు రాజారాం, సునీల్, విజయ్ కుమార్, జాదవ్ బిక్కు, బషీర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం



నవతెలంగాణ-తాంసి

గర్భిణులు బాలింతలు పౌష్టికాహారంతోనే తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నిఖిల్ రాజ్ గర్భిణులకు సూచించారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో అందర్‌బంద్, గిరిగాం ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలలో ఉన్న 63 గర్భిణీ స్త్రీలకు రక్త పరీక్షలు ఆరోగ్య సలహాలు, సూచనలు మందుల పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ వారికి ఆరోగ్య సూచనలు చేశారు. సంపూర్ణ పోషకాహారం ప్రాధాన్యత, కాన్పుల, కాన్పుల మధ్య వ్యవధి కోసం తాత్కాలిక పద్ధతులైన నిరోధ్, ఓరల్ పిల్స్, అంతర ఇంజెక్షన్, పీపీఐయూసీడీగాని ఉపయోగించుకోవాలని, తద్వారా తల్లి పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, ఆరోగ్యంగా, మానసికంగా, ఆర్థిక పరంగా ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమంలో ఈ విధంగా మాతాశిశు సంరక్షణ చేయడం జరిగుతుందని, మన ఉపకేంద్రాల సిబ్బందితో అన్ని రకాల పరీక్షలు, ఆరోగ్య సలహాలు, వారు తెలిపిన ఆరోగ్య అవగాహనను పాటించాలని, అనుబంధ పోషకాహారాన్ని సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి తీసుకోవాలని అన్నారు. న్యూట్రీషన్లు కిట్స్-7 గర్భిణీ స్త్రీలకు అందించడం జరిగిందని, సురక్షిత కాన్పు కోసం మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలను ఉపయోగించుకోవాలని, ప్రమాద భరితలక్షణాల గల 7-గర్భిణీ స్త్రీలను రిమ్స్‌కు పరీక్షలు, చికిత్సల కోసం పంపడం జరిగిందని అన్నారు. మండలంలోని ప్రతి ఒక్కరూ గర్భిణులు బాలింతలు పరీక్షలు చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

కార్యక్రమంలో విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు కె.లూసి, బి.గంగాధర్, స్టాఫ్ నర్సులు ప్రియాంక, హీరాబాయ్, ఆరోగ్య కార్యకర్తలు సుజాత, విష్ణుకుమార్, ఫార్మాసిస్ట్ అశోక్‌రెడ్డి, ఆశాకార్యకర్తలు సిబ్బంది రేఖ, శంకర్, శివాజి, రాందాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యకు పెద్దపీట

• మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ పెద్దపీట వేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ రూరల్ మండలంలోని అనంతపేట్ గ్రామంలో రూ.3.80 కోట్లతో నిర్మించిన కేజీబీవీ బాలికల పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ విద్యారంగానికి ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. కేజీబీవీ ఏర్పాటు చేయడంతో పేద విద్యార్థినులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. పాఠశాలలో సకల సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకొని రూ.3.80కోట్లతో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కేజీ టు పీజీ అమలులో భాగంగా ప్రభుత్వం కేజీబీవీలను ప్రారంభించి బాలికలకు మెరుగైన విద్యనందిస్తుందన్నారు. అనంతపేట్‌లో ఏర్పాటు చేసిన కేజీబీవీ పేద విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సకల సౌకర్యాలతో భవన నిర్మాణం చేపడుతుండటంతో విద్యార్థినుల, ఉపాధ్యాయుల సమస్యలు తొలగిపోనున్నాయని అన్నారు. కార్యక్రమంలో జలశాఖ మండలి రాష్ట్ర చైర్మెన్ డా.వేణుగోపాలచారి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో పంటరుణాలను మాఫీ చేయాలి



నవతెలంగాణ-బోథ్

రాష్ట్ర ప్రభుత్వం 2018లో ఇచ్చిన రుణమాఫీ హామీని వెంటనే అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బోర్రన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన మాట్లాడుతూ రైతులకి ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. ఒక వైపు రైతంగామంతా పంటరుణాన్ని మాఫీ చేస్తారని ఎదురు చూస్తున్న, రైతులకి లక్షలోపు రుణమాఫీ చేయాల్సి ఉండగా 2020లో రూ.25 వేలలోపు ఉన్న వారికీ మాత్రమే మాఫీ చేయడం జరిగిందన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.50వేల వరకు రుణమాఫీ చేస్తానని ప్రభుత్వం ప్రకటించిన, ఇప్పటి వరకు చేయలేదన్నారు. ఒక పక్కన రుణమాఫీ కాకా మరొక పక్క తను తీసుకున్న పంట రుణాన్ని రెన్యూవల్ చేయకుండా ఆ వ్యక్తి డిఫల్టార్‌గా మారే అవకాశం ఉందని అన్నారు.అప్పులకి వడ్డీమీద వడ్డీ పెరిగి తిరిగి రుణాన్ని చెల్లించలేక, సతమతం అవుతూ తిరిగి ప్రయివేట్ దళారుల వద్ద నుంచి అప్పులు తీసుకోవాల్సి అవసరం ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో లక్షరూపాయల వరకున్న రైతులందరికి ఒకేసారి రుణమాఫీ చేయాలనీ రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రాజు, సోము, గంగారాం, శంబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం తపస్ ఉద్యమ కార్యాచరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 19న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని వినాయక చౌక్ శిశు మందిర్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఓ 317 ద్వారా స్థానికతను కోల్పోయి అనేక మంది టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడితే సమస్యలు పరిష్కారమవుతాయని భావించామని అన్నారు. 9 ఏండ్లు అవుతున్నా సమస్యలు యథాతథంగా ఉన్నాయన్నారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టడం లేదని, పండితుల, పీఈటీల ఉన్నతీకరణ చేయలేదని అన్నారు. హెల్త్ కార్డులు పనిచేయడం లేదని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను ఇంకా ప్రకటించలేదని, పీఆర్సీ గడువు ముగిసిన ఇంతవరకు కమిటీని ప్రకటించలేదని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తపస్ రాష్ట్ర శాఖ ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని అన్నారు. ఈ నెల 19 నుంచి 23 వరకూ క్లాంప్లెక్స్ స్థాయిలో టీచర్ల సంతకాల సేకరణ, 25న తహసీల్దార్ ఆఫీసుల వద్ద నిరసన కార్యక్రమాలు, 31న ఆర్డీఓలకు వినతిపత్రాలు ఇవ్వడం, ఆగస్టు 5న కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు 19న మహాధర్నా నిర్వహిస్తామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉపాధ్యాయుల పట్ల, విద్యావ్యవస్థ పట్ల అలసత్వాన్ని వీడి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు మెట్పల్లి గోపాలకృష్ణ, తపస్ అర్బన్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు దత్తాత్రి ముండే, గాండ్ల అనిల్, కేశవ్, గోపాల్, రితేష్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిరికొండ

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశీల దత్తు, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్, కోశాధికారిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రసూల్, ప్రచార కార్యదర్శిగా గుగ్గిళ్ల స్వామి, సంయుక్త కార్యదర్శిగా జనార్ధన్, సలహాదారులుగా రాజేశ్వర్, సభ్యుడిగా మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖ నాయక్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో టీఎస్కేసీ- టాస్క్ ఆధ్వర్యంలో తదుపరి తరం ఉపాధి నైపుణ్యాలు అలాగే మైక్రోసాఫ్ట్ అజూర్ అనే సాఫ్ట్వేర్‌ను ఉపయోగించి, క్లౌడ్ కంప్యూటింగ్ చేయడం అనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ జగ్‌రాం అన్నారు. మంగళవారం కళాశాలలో ఈ శిక్షణను కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ శిక్షణ నేటి నుండి 140 గంటల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. టాస్క్‌లో రిజిస్టర్ అయిన అందరూ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీఎస్కేసీ కోఆర్డినేటర్ డి.దయాకర్, తెలంగాణ టాస్క్ శిక్షకులు నరేందర్, అధ్యాపకులు సాయిప్రసాద్, రడాపు సంతోష్ కుమార్, విజయ్ కుమార్, డా.ముమ్మడి నర్సింగారావు, జ్యోత్స్న, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడ గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు సందీప్‌రెడ్డి, పోతారెడ్డి, ఆధ్వర్యంలో మంగళవారం వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ముధోల్ నియోజకవర్గ నాయకులు విజయకుమార్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో కుంటాల, కుభీర్, లోకేశ్వరం, తానూర్ మండలాల నుంచి వివిధ పార్టీల కార్యకర్తలు చేరినట్లు వారు పేర్కొన్నారు.

సీపీఆర్‌పై ఆశాలకు అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఏజెన్సీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.మనోహర్ ఆశాలకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఒక వ్యక్తి గుండె ఆగకుండా అపస్మారక స్థితిలోకి వెళ్లినపుడు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గుండె ఆగిపోయి మెదడుకు ఆక్సిజన్ సరఫరా ఆగిపోయి వ్యక్తి చనిపోవడం జరుగుతుందని, అలాంటి సందర్భాల్లో వ్యక్తికి ఆక్సిజన్‌ను అందించడంలో బాగంగా సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 15 మంది హాజరు కాగా ఇందులో ఎనిమిది మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి లయన్స్ క్లబ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచిత ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అనిత తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో చరిత్ర, తెలుగు, కంప్యూటర్ సైన్స్, రాజనీతిశాస్త్రం, కామర్స్ సబ్జెక్టులకు రెండేసి చొప్పున, ఇంగ్లీషు సబ్జెక్టుకు మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆయా సబ్జెక్టులలో పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 21లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, పూర్తి వివరాలకు 7013607011 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్య మహిళా క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లీనికలను సద్వినియోగం చేసుకోవాలని కుష్టు నివారణ విభాగం రాష్ట్ర సంయుక్త సంచాలకులు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జాన్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న క్లినిక్‌ను తనిఖీ చేశారు. మహిళలకు చేపడుతున్న వైద్య చికిత్సలు, అందిస్తున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మంగళవారం ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేకంచి మహిళల కోసం శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఎనిమిది రకాల పరీక్షలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ భీంరావు, డాక్టర్ శిల్ప, అలేఖ్య, హెచ్ఈఓ సూర్యప్రకాష్, సూపర్‌వైజర్ దేవిదాస్ పాల్గొన్నారు.

పంటల బీమాపథకాన్ని అమలు చేయాలి

నవతెలంగాణ-నేరడిగొండ

ప్రతి సంవత్సరం జిల్లాలోని రైతులు పండించిన పంటలు అతివృష్టి, అనావృష్టి అధిక వర్షాలు పడటం మూలంగా తాము పండించిన పంటలు నష్టపోయినప్పుడు రైతులకి నష్టపరిహారం ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందడం లేదని ప్రభుత్వం పునః సమీక్షించి నష్టపరిహారాన్ని వెంటనే స్పందించి, ఈ ఖరీఫ్ సీజన్‌లో ఈ (వర్షాకాలం) నుండే పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని అన్నారు. నేరడిగొండ మండలంలోని కుప్టి, కుమారి గ్రామ రైతులతో కలిసి కిషన్ మిత్ర ఫీల్డ్ కోఆర్డినేటర్ ఆవుల రాకేష్, రైతులు వెంకట్, రమణ, గద్దల వెంకటరమణ, జ్ఞానేశ్వర్లు కోరారు.